క్లుప్తంగా

శంకర్‌లూక్‌కు శుభాకాంక్షలు

ముషీరాబాద్: మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా నియమితులైన శంకర్‌లూక్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం ఖైరతాబాద్‌లోని మైనార్టీ కమిషన్ కార్యాలయంలో ఆయనను కలిసిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ, లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

దేశం గర్వించదగ్గ నేత అటల్ జీ



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: అజాత శత్రువు, దేశం గర్వించదగ్గ నేత దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి మళ్లీ జన్మించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. దేశంలో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత వాజ్‌పేయిదేనన్నారు. బీజేపీ నేతలు ఎం.నర్సింగ్‌రావు, బల్వీర్, ప్రతిభ, ఓంప్రకాష్, బాలప్రసాద్, ఎస్.రవియాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఈనెల 19న కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించే బీసీల శంఖారావం సదస్సును జయప్రదం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసు సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార కేంద్ర కార్యాలయంలో ఈ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. దాసు సురేష్ మాట్లాడుతూ.. వార్డు మెంబర్ నుంచి మున్సిపల్ చైర్మన్ వరకు గడిచిన 40 ఏళ్లలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ద్వారా ఎన్నికైన నాయకులంతా ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దొంత ఆనందం, బోనం ఊర్మిళ, మురళీధర్, బొమ్మ నరేందర్, చిక్కా దేవదాస్, కిషోర్, ఆకాష్ తదితరులున్నారు.

ప్రొ.గాలి వినోద్‌కుమార్‌కు వీడ్కోలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ న్యాయ కళాశాల అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉద్యోగానికి వీఆర్‌ఎస్ ఇచ్చిన గాలి వినోద్‌కుమార్ ఆయన భార్య చంద్రకళను బుధవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ ప్రొ.రాధిక యాదవ్, లా సీనియర్ అధ్యాపకులు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, హెడ్ ప్రొ.వెంకటేశ్వర్లు, ప్రొ.రాంప్రసాద్ పాల్గొన్నారు.

వర్సిటీల బంద్ ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన యూనివర్సిటీల బంద్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం తెలంగాణ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ వర్సిటీలను బంద్ చేశారు. ఓయూ, కేయూ, పాలమూరు, శాతవాహన, తెలంగాణ, తెలుగు వర్సిటీ, మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ తదితర యూనివర్సిటీల పరిధిలోని వివిధ కాలేజీలను బంద్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో ఇందిరా పార్క్ వద్ద 48 గంటల సామూహిక సమర దీక్షను చేపట్టనున్నట్లు అధ్యాపక జేఏసీ నాయకులు వేల్పుల కుమార్, ఉపేందర్ రావు, విజేందర్‌రెడ్డి తెలిపారు.

పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలి



లాలాపేట: లాలాపేట ప్రధాన రహదారి నుంచి సత్యానగర్‌కు వెళ్లే మార్గంలో మట్టి రోడ్డులో పక్కా రోడ్డు వేస్తామని చెప్పిన అధికారులు కాలయాపన చేస్తున్నారని సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో గుంతలు, వేసవిలో దుమ్ము రేగుతున రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురికాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు వందల మంది నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారని ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తుదిదశ ఓటరు జాబితాకు కసరత్తు

- ఈ నెల 21న మొదటి ఓటర్ల జాబితా విడుదల
- సెప్టెంబర్ 19 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబరు 4 నాటికి తుది జాబితా



అంబర్‌పేటలో ఓటరు జాబితా ప్రక్రియను చేపడుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

అంబర్‌పేట: ఓటరు జాబితా ఏర్పాటుకు ప్రత్యేక కసరత్తు జరుగుతుంది. నియోజకవర్గంలో ఈ నెల 5 నుంచి జీహెచ్‌ఎంసీ సర్కిల్ -16 అధికారులు ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

- నియోజకవర్గంలో ఓటర్లు ఇచ్చిన చిరునామాలో ఉన్నారా.. లేదా.. ఒకరికి.. ఒకటికి మించి ఓటు ఉందా.. ? కొత్త ఓటరుగా అర్హత ఉన్న పేరు నమోదు తదితర అంశాలను జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.
- ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు అధికారులు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారు. అర్హులైన వారు తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు సవరించుకోవాలని సూచిస్తున్నారు.

10 శాతం పత్తాలేని ఓటర్లే...

- నియోజకవరగంలో 104 పోలింగ్ భవనాల్లో 236 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. కాగా ప్రతి పోలింగ్ బూత్‌లో సుమారు 900 నుంచి 1300 వరకు ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు 10 శాతం ఓటర్లు అందుబాటులో లేరు.
- గతంలో ఇక్కడ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లి వారున్నారు.
- కొంత మంది చనిపోవడంతో తుది ఓటరు జాబితాలో 10 శాతం ఓటర్లు అందుబాటులో లేకుండా పోయారు. ఇప్పటికైనా ఈ విషయంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రస్తుతం ఓటర్లు

మొత్తం ఓటర్లు	2,58,704
పురుషులు	1,31,843
మహిళలు	1,26,851
పోలింగ్ భవనాలు	104
పోలింగ్ బూత్‌లు	236

రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్‌లు చొరవ తీసుకోవాలి..

- ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణ ప్రక్రియపై కాలనీ, అపార్టుమెంటు, బస్తీ అసోసియేషన్లు చొరవ తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఓటరు జాబితాలో ఉన్న పేర్లు, స్థానికంగా నివస్తున్న వారి వివరాలు అసోసియేషన్ ప్రతినిధులకు తెలిసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం తమ వంతు చొరవ తీసుకుని సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ఈనెల 21న ఓటరు జాబితా విడుదల...

- ఓటరు నమోదు, సవరణకు జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టే కార్యక్రమంలో ఈనెల 21తో ముగుస్తుంది. ఓటరు జాబితా సైతం విడుదలవుతుంది. ఓటరు జాబితాలో అభ్యంతరాలు, సవరణలకు వచ్చే నెల సెప్టెంబరు 19 వరకు అవకాశం కలిప్తారు. అనంతరం ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను అధికారులు అదే నెల 28 వరకు పరిష్కరిస్తారు. అక్టోబరు 4న తుది ఓటరు జాబితాను విడదల చేయనున్నట్లు సమాచారం.

అందరి సహకారంతోనే ఓటరు జాబితా



ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటాను. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి జాబితాలో ఇబ్బందులు లేకుండా కృషి చేస్తాం. ఒకసారి ఓటరు జాబితాలో పేరు నమోదు అనంతరం దానిని తొలగించడానికి వారి అనుమతి లేదా తగిన అధికారులు ఉంటే తప్పా.. తొలగించడానికి లేదు. ఓటరు సవరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ప్రస్తుతం ఉన్న అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– మారుతి దివాకర్, సర్కిల్–16 డీఎంసీ

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో చేపట్టిన పైప్‌లైన్ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జలమండలి అధికారులకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థ దశాబ్దాల తరబడి ప్రజలకు అందుబాటులో ఉండేలా పటిష్టంగా చేపట్టాలన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..

- అంబర్‌పేట నియోజకవర్గంలో సీఎం రిలీఫ్‌ఫండ్ పథకం క్రింది 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3.01 లక్షల చెక్కులను అందజేశారు. క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసి భరోసా ఇచ్చారు.

రోడ్డు సుందరీకరణ పనుల పర్యవేక్షణ...

- శ్రీరమణ చౌరస్తా నుంచి అలీకేఫ్ వరకు రోడ్డు సుందరీకరణ, డివైడర్లపై మొక్కల ఏర్పాటు, ఇరువైపుల ఏర్పాటు చేస్తున్న గార్డెన్స్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. సకాలంలో చేపట్టిన పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష



పూలే విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: బీసీబంధు బీసీ కులాల అందరికీ వర్తించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడె ఆలె భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అంబర్‌పేట పూలే విగ్రహం చౌరస్తాలో చేపట్టిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం బీసీలపై వివక్ష చూపుతుందని మండిపడ్డారు. తక్షణమే బీసీలందరికీ లక్ష రూపాయల ఆర్థికసాయం అందజేయాలన్నారు. ఓబీసీ మోర్చా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, అమృత, కన్నె ఉమారమేష్‌యాదవ్, నాయకులు శ్యామ్‌రాజ్, రమేష్, పత్తి అనిల్, కిశోర్‌కుమార్, వెంకటస్వామిగౌడ్, వనం రమేష్ తదితరులున్నారు.

స్విమ్మింగ్‌పూల్ నిర్వహణపై కార్పొరేటర్ అసహనం

అంబర్‌పేట: జాతీయ స్థాయి ఉన్న జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్ నిర్వహణ అధ్వానంగా ఉండటంపై కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. స్విమ్మింగ్‌పూల్‌లో నీరు కలుషితం కావడంపై పలువురు ఫిర్యాదు మేరకు ఆయన బుధవారం స్విమ్మింగ్‌పూల్‌ను సందర్శించారు. తక్షణమే స్వచ్ఛమైన నీటిని ఏర్పాటు చేసి స్విమ్మింగ్‌కు వచ్చేవారికి అందుబాటులో ఉంచాలని ఆయన సిబ్బందికి ఆదేశించారు.



జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



చెంచుబస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కె.పద్మావతిరెడ్డి

అంబర్‌పేట: బస్తీల్లో పేదల ఇబ్బందులను తొలగించేందుకు పార్టీ తరఫున తనవంతు కృషి చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం ఆమె బాగ్‌అంబర్‌పేట డివిజన్ చెంచుబస్తీలో 'బస్తీలో బీఆర్‌ఎస్' కార్యక్రమాన్ని నిర్వహించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బస్తీ పెద్దలు మైసయ్య, కృష్ణ, బాలకృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్. కృష్ణయ్య అరెస్టు అక్రమం'

ముషీరాబాద్: రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్యతో పాటు పలువురు బీసీ సంఘం నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకపోగా.. వారిని అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలైన సమాన పనికి, సమాన వేతనం తీర్పును అమలు చేయాలనే డిమాండ్లతో సుమారు 20 వేలమంది ప్రజాస్వామ్య బద్ధంగా విద్యాశాఖ కమిషనరేట్ వద్ద ధర్నా చేస్తుంటే పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. దేశంలో రికార్డు స్థాయిలో ఉద్యమాలు చేసిన చరిత్ర ఉన్న బీసీ సంక్షేమ సంఘానికి, ఆర్.కృష్ణయ్యకు ఇటువంటి నిర్బంధాలు కొత్తేమి కాదన్నారు. ఈ అరెస్టుపై రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆర్.కృష్ణయ్య అరెస్టు ఖండించిన గుజ్జ సత్యం...

- ఔట్‌సోర్సింగ్ టీచర్ల క్రమబద్ధీకరణకై పాఠశాల విద్యా కమిషనర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆర్.కృష్ణయ్యను అక్రమంగా అరెస్టు చేయడాన్ని జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తీవ్రంగా ఖండించారు. స్పీకర్ అనుమతి లేకుండా అరెస్టు చేయడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ అరెస్టును నిరసిస్తూ.. విద్యానగర్‌లో ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, రాజ్‌కుమార్, వెంకట్, వంశీ, పోతరాజు వెంకటేష్ తదితరులున్నారు.

కలెక్టర్ సందర్శన

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనుల జాప్యంపై ఆగ్రహం



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

కాచిగూడ: కాచిగూడ ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కాలేజీని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ సందర్శించారు. మనబస్తీ, మనబడి కార్యక్రమంలో భాగంగా కాచిగూడ ప్రభుత్వ హైస్కూల్లో జరుగుతున్న మధ్యాహ్న భోజనం, డైనింగ్‌హాల్ నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. పనులు జాప్యంపై కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్‌లో సెకండియర్ చాలా కీలకమైన విద్యా సంవత్సరమని, కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, శ్యామ్యూల్, లక్ష్మణ్‌సింగ్, నిజాముద్దీన్, హెడ్ మాస్టర్ డి.సుకన్య, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వైఎస్ స్వర్ణలత, సీనియర్ లెక్చరర్ ప్రసాదరావు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మయ్య, రజని, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేసిన కళాకారుడు గద్దర్



మాట్లాడుతున్న ఎం.వెంకటస్వామి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తన కలం, గళంతో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప కళాకారుడు గద్దర్ అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలె) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వెంకటస్వామి అన్నారు. బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్‌పీఐ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దొరల గడీల రాజ్యం, అణగారిన వర్గాలు, మహిళలపై జరుగుతున్న హింసపై తాను పాడిన పాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. రాష్ట్ర ఉద్యమంలో గద్దర్ పాత్రను కూడ మరువలేమన్నారు. ఆర్‌పీఐ సౌత్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బరాయుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.శ్రావణ్‌కుమార్, సీనియర్ జర్నలిస్టు జీ.బీ.రాజు, దయానంద్, ఎ.శివరాజ్ పాల్గొన్నారు.

సామాన్యులు తలెత్తుకుని తిరిగేలా..

చిక్కడపల్లి: సామాన్యులు సైతం అందరితో పాటు సమానంగా తలెత్తుకుని తిరగాలనే ఉద్దేశంతో గద్దర్ తన వంతుగా పేద ప్రజానీకం సమస్యలను తన పాటల ద్వారా ఎంతో కృషి చేశారని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలంగాణ అమరవీరులు జేఏసీ, ప్రజ్ఞా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ బుధవారం చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ.. 'సామాన్యులు ఎల్లకాలం సామాన్యులుగా ఉండిపోకూడదు'.. 'అందరితో పాటు తలెత్తుకుని తిరగాలనే భావనతో గద్దర్ ఉండే వారన్నారు'. కులమతాల హెచ్చుతగ్గులు ఉండరాదని దోచుకునేవారు ఉండకూడదని గద్దర్ భావించి దాన్నే ఆయన తన పాటల్లో చెప్పారన్నారు. దళిత సేన జాతీయ నాయకులు డాక్టర్ జేబీరాజు, నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి, నిర్వాహకులు కోళ్ల సుధాకర్, పాతశివకుమార్(జగన్), ప్రఫుల్ రామ్‌రెడ్డి, తేజాస్వరూప్ ప్రతాపనేని, సుధాకర్, లైబ్రరీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయోధ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలుశిక్ష

లాలాపేట: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు శిక్ష విధించిన ఘటనా ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భార్గవి వివరాల ప్రకారం.. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన శ్రీశైలం, చిలకలగూడ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ ఈ నెల 10న తార్నాక చౌరస్తాలో విధుల్లో ఉన్న నల్లకుంట ట్రాఫిక్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఇరువురిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా 8వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

అన్నదానం

చిక్కడపల్లి: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చిక్కడపల్లి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్ గుప్తా అన్నారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నదాతలు ప్రొద్దుటూరి నర్సింహారావు, సహదాత కృష్ణమూర్తి, సంఘం నాయకులు చేపూరి లక్ష్మణ్, శ్రీనివాస్, రవి, బాలకుమార్, ప్రసాద్, సింగారపు శంకర్, బాలచందర్, వెంకట సుబ్బయ్య, న్యాయవాది సురేందర్ గుప్తా, శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్, లక్ష్మీవెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రైల్లో వ్యక్తి మృతి

కాచిగూడ: అనారోగ్యంతో మైసూర్ రైల్లో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అబిడ్స్‌కు చెందిన జోసఫ్ కుమారుడు రాజు (66) కూలి పని చేస్తుంటాడు. కొద్ది రోజుల క్రితం బెంగుళూర్‌లో ఉండే అక్క దగ్గరకు వెళ్లాడు. బుధవారం ఉదయం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం –1లో ఆగి ఉన్న బెంగుళూర్ – కాచిగూడ మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో అనారోగ్యంతో రాజు మృతి చెందాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైల్వే ప్రాజెక్టులు, డబుల్ లైన్ల నిర్మాణం హర్షం

లాలాపేట: మూడు రైల్వే ప్రాజెక్టులు, డబుల్ లైన్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ అధికార ప్రతినిధి శారదా మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ నుంచి గుత్తి వరకు దాదాపు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. దీంతో పాటు మేడ్చల్ నుంచి ముత్కేడ్ వరకు, అత్యంత రద్దిగా ఉంటే బీబీనగర్, గుంటూరు మార్గంలో డబుల్ లైన్ వేయడంతో రైళ్ల వేగం పెరగడంతో పాటు ప్రయాణికుల సమయం ఆదా అవుతుందన్నారు.

మహిళల ఆత్మరక్షణకు 'యోధా'లో శిక్షణ

బంజారాహిల్స్: మహిళల ఆత్మరక్షణకు యోధా సెల్ఫ్‌డిఫెన్స్ వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమ ప్రచారకర్త, అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్, తైక్వాండో బ్లాక్‌బెల్ట్ గ్రహీత వరుణి జైస్వాల్ అన్నారు. యోధ మహిళా ఫైటర్ సెల్ఫ్ డిఫెన్స్ జాతీయ వర్క్‌షాప్ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె సుప్రీం కోర్టు న్యాయవాది పూర్వ అగర్వాల్‌తో కలిసి ప్రారంభించారు. సుప్రీం కోర్టు న్యాయవాది అరుణ్‌కుమార్ జైస్వాల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇది దేశ వ్యాప్తకార్యక్రమం కాగా 200 మంది నగర మహిళలు ఇందులో పాల్గొన్నారు. మహిళల ఆత్మరక్షణ అవగాహన కోసం ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. స్వీయ రక్షణకు సంబంధించిన చట్టపరమైన అంశాలను వీరు వివరించారు. అరుణ్‌కుమార్ జైస్వాల్ తీసుకున్న ప్రయత్నాన్ని అందరూ ప్రశంసించారు.


విజ్ఞానంతో కూడిన చదువులు అవసరం



మాట్లాడుతున్న రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద

కాచిగూడ: విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విద్య అవసరమని, ఆ దిశగా చదవాలని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. కాచిగూడలోని భద్రుకా కళాశాలలో వివేకానంద మానవ ప్రతిభ విభాగం ఆధ్వర్యంలో ×సౌశీల్య నిర్మాణం₹ అనే అంశం పై అతిథి ఉపన్యాసం కార్యక్రమానికి స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసించి పేదల అభ్యున్నతి, దేశాభివృద్ధికి తమ జ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. జాతి నిర్మాణంలో వ్యక్తి సౌశీల్యం ప్రధానమైన పాత్ర పోషిస్తుందని, విద్యార్థులే భారతదేశ భవిష్యత్తు అని అన్నారు. జీవితంలో వారికి అందించిన విలువలపై మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. కళాశాల సెక్రెటరీ శ్రీ కిషన్ భద్రుక, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటయ్య, వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ విభాగం కో– ఆర్డినేటర్ వేణు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎం.అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: కళ్ల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ సూచించారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శంకర నేత్రాలయం బల్కంపేట్, హైదరాబాద్ లయన్స్‌క్లబ్, కోఠి క్లబ్ సంయుక్తాధ్వర్యంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు. సామాజిక సేవే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ప్రముఖ కంటివైద్యు నిపుణుడు రవీందర్‌గౌడ్ తెలిపారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి రమాదేవి, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, అంజుమన్ సొసైటీ అధ్యక్షుడు అక్తర్‌అలీ, మహ్మద్‌అలీ సోఫీసమద్, జఫీరుద్దీన్, సంగపాక వెంకటేష్, సురేష్, శివ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషిచేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. బుధవారం బస్తీబాటలో భాగంగా గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ఉల్లిగడ్డ బస్తీలో బీజేపీ నేత రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో ఆమె పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇంకా మంజూరు కాలేదని ప్రత్యేక శద్ధ పెట్టి అవి మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ నెల 18 న బీజేపీ ధర్నాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, రవీందర్‌గౌడ్, దోనేటి సత్యం, శివ తదితరులున్నారు.

వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



పంజగుట్ట: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రమంజిల్, రామకృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీల విజేతలకు బుధవారం ఫౌండేషన్ చైర్మన్ పి.విజయారెడ్డి బహుమతులు అందజేశారు. రామకృష్ణానగర్‌కు చెందిన యువకులు సతీష్ మిత్రబృందం వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో డీవీకే దేవరకొండ బస్తీ మొదటి బహుమతిగా రూ. 5 వేలు, ట్రోఫీ, రెండవ బహుమతిగా ఖైరతాబాద్ టీంకు రూ. 2 వేలు, ట్రోఫీని విజయారెడ్డి అందించారు.